క్లుప్తంగా

కొండలమ్మను దర్శించుకున్న సీఐ



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మ వారిని గుడివాడ సీఐ సోమేశ్వరరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఐని అర్చకుడు దుశ్శాలువాతో సన్మానించి, అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వారి కుటుంబం పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు.

వీరమ్మ తల్లి దేవస్థానానికి శంకుస్థాపన



గుడ్లవల్లేరు: మామిడికోళ్లలో వందేళ్ల పైగా చరిత్ర కలిగిన శ్రీ వీరమ్మ తల్లి దేవస్థాన పునర్నిర్మాణానికి శనివారం వేద పండితులు శంకుస్థాపన చేశారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకుడు చేకూరి జగన్మోహనరావు, జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్, ఆలయ వంశ పారంపర్య నిర్వాహకుడు మండా రాంబాబు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు జెట్టి శ్రీరాం, నాగేశ్వరరావు, (ప్రసాద్), ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, నరేంద్ర, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం దాడులు ఆపాలి



మొవ్వ: విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన వ్యక్తులపై, చేయించిన ప్రభుత్వంపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మొవ్వ అంబేడ్కర్ యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. మొవ్వ గ్రామంలోని ప్రధాన కూడలిలో అంబేడ్కర్ యూత్ సభ్యులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. కూడమి ప్రభుత్వం ఇటువంటి దాడులను వెంటనే ఆపివేయాలన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దగాని బాపూజీ, దగారి శ్రీనివాస్, డీకొల్లు రాజశేఖర్, వేణు, గౌతమ్, మణికంఠ, అనిల్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా బాలింతలకు పౌష్టికాహారాలతో కూడిన ప్రెగ్నెంట్ కిట్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు టి.ఎస్.రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్ లోని పెలికాన్ హాస్పిటల్లో శనివారం ఇవి అందజేశామని పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వై.శ్రీరోజా, క్లబ్ కార్యదర్శి కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షులు పి.చంద్రశేఖరరావు, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, సభ్యుడు రంగారావు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ వార్షికోత్సవం



గుడివాడ టౌన్: యూటీఎఫ్ 50వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యనారాయణపురంలోని కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షుడు కేవీ సుబ్బారావు ఆ సంఘ పతాకాన్ని ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత యూటీఎఫ్ ఆవిర్భావానికి, అభివృద్ధికి కృషిచేసిన ఆ సంఘ నాయకులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు మాట్లాడుతూ తమ సంఘ అభివృద్ధికి కృషిచేసిన ప్రతిఒక్కరినీ స్మరించుకోవాల్సిన అవసరత ఎంతైనా ఉందన్నారు. ఆ సంఘ జిల్లా కార్యదర్శులు ఎల్.నరేంద్ర, ఎ.వి.వరలక్ష్మి, స్టేట్ కౌన్సిలర్ సీహెచ్.శ్రీనివాస్, ఆడిట్ కమిటీ సభ్యుడు వి.రాజారావు, గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు, పెదపారుపూడి మండలాల యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారులు



పామర్రు మండలం కురుమద్దాలి అండర్ పాస్ వద్ద ప్రమాదాలకు కారణమవుతున్న గుంత



తోట్లవలూరులో గుంతలమయంగా కేఈబీ కాలువ వంతెన రహదారి

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు–ఉయ్యూరు ఆర్ అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కృషితో సుమారు ఐదు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి జరిగింది. నిధుల మంజూరులో జాప్యం కారణంగా మరో రెండు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో మేరుగు సుబ్బారావు బట్టీల ప్రాంతం నుంచి పెట్రోల్‌బంక్ వరకు, మెయిన్ సెంటర్ నుంచి కేఈబీ కాలువ వంతెన వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. చినుకుపడితే చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనచోదకుల ఇక్కట్లు

కురుమద్దాలి(పామర్రు): మండలంలోని కురుమద్దాలి గ్రామం వద్ద ఉన్న విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డు అండర్ పాస్ ప్రాంతం పల్లంగా ఉండటం కారణంగా వర్షాలకు నీరు అక్కడికి చేరుతోంది. అదే ప్రదేశంలో గోతులు ఏర్పడటం వలన వర్షం కురిసినప్పుడు అండర్ పాస్‌లోని గోతుల్లో వర్షం నీరు చేరి కనబడక ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అండర్ పాస్ వద్ద ఉన్న గోతులను పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పీహెచ్‌సీకి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయండి



పీహెచ్‌సీ సమీపంలో డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు

మండవల్లి: మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటప్రోలు కృష్ణారావు, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు కోరారు. స్థానిక జాతీయ రహదారిని, పీహెచ్‌సీకి వెళ్లే రహదారిని శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డ్రెయినేజీ నిర్మాణం జరిగినప్పటికీ రోడ్డును పునరుద్ధరించకపోవడంతో సరైన రోడ్డు మార్గం లేక పీహెచ్‌సీకి వెళ్లే రోగులు, వృద్ధులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా డ్రెయినేజీ నిర్మాణాలు, తాగునీటి పైపులైన్ పనులు కూడా పూర్తికాలేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఏసుబాబు, శ్యామలగౌడ్, బండి రంగారావు పాల్గొన్నారు.

గురజాడ అండర్‌పాస్ వద్ద వర్షం నీరు తొలగింపు



గురజాడ అండర్‌పాస్ వద్ద తొలగించిన నీరు



గురజాడ వద్ద నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన సైడ్ కాలువ

సాక్షి ఎఫెక్ట్

పమిడిముక్కల: చెరువులా మారిన గురజాడ అండర్‌పాస్ శీర్షికన సాక్షిలో గత నెల 20వ తేదీన ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించారు. సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని చూపుతూ సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారుల సంస్థ అధికారులు గురజాడ అండర్‌పాస్ వద్ద ఇరువైపులా సైడ్ కాలువలు తీయించి, నీరు పోయే ఏర్పాటు చేశారు. తాడంకి అండర్‌పాస్ వద్ద కూడా రోజుల తరబడి వర్షం నీరు నిలిచి ఉంటోంది. రాకపోకలు సాగక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కూడా నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి



గుడివాడలో శిక్షణ ఇస్తున్న ట్రైనర్, పక్కన ఎంపీపీ



కోడూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు

ఎంపీపీ పుష్పరాణి

గుడివాడరూరల్: పంచాయతీల్లో అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. గుడివాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికల తయారీ, వాటి పరిశీలన, తాగునీరు, పారిశుద్ధ్యం పనుల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాట్లు తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు చేపట్టాల్సిన విధులు, చర్యల గురించి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లతో చర్చించి పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీఓ కె.జ్యోతి మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన వారు విధుల నిర్వహణలో అమలు చేసి ప్రజల నుంచి మన్ననలు పొందాలని సూచించారు. విధుల నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకూడదన్నారు. ప్రజలకు ప్రభుత్వం తరఫున అందనున్న సేవలు, సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొళ్ల రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ త్రినాథ్‌రావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపై శ్రద్ధ చూపాలి

ముదినేపల్లి రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులను మెరుగు పరిచేందుకు కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈఓపీఆర్డీ దూలం లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కోడూరులో చెత్తసంపద కేంద్రం వద్ద సర్పంచ్‌లు, కార్యదర్శులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా చెత్తను సేకరించడంతో పాటు, వీటిని చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఎరువుగా మార్చాలన్నారు.

వాణి సదన్‌లో అగ్ని ప్రమాదం

పామర్రు: స్థానిక విజయవాడరోడ్డులో ఉన్న వాణి సదన్‌లో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. సదన్ అపార్టుమెంట్ కింద ఫ్లోర్ లో మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన కార్యాలయం మూసి ఉంటోంది. దానిలో శనివారం విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి కరెంట్ మీటర్ నుంచి నిప్పులు రాలాయి. మీటర్ కింద సోఫా తదితర సామగ్రి ఉండటం వలన మీటర్ నుంచి వచ్చిన నిప్పులు సోఫాపై పడి సోఫా అంటుకుంది. దీంతో ఆ గదిలో నుంచి పొగలు రావటంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో సుమారు రూ.10 వేల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు.

రూటు మార్చి రోడ్డు నిర్మాణం



మండవల్లి: విజయవాడ–భీమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మండవల్లిలోని తరుగుమూల నుంచి వెళ్లే రహదారిని అధికారులు రూటు మార్చి నిర్మాణం చేస్తున్నారు. తరుగుమూల రహదారిపై గతంలో రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతుండేవి. ఇక్కడ రోడ్డు ఎల్–ఆకారంలో ఉండి ఎదురుగా వచ్చే వాహనాలు డ్రైవర్లకు కనపడకపోవడంతో ఒకదానికొకటి ఢీకొని ప్రమాదాలు జరుగుతుండేవి. దీంతో అధికారులు స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం సమీపం నుంచి రహదారిని కొర్లపాడు గ్రామం వద్ద మెయిన్ రోడ్‌లో కలిసేలా రూటుమార్చి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పాత రహదారి నుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

అగ్నిప్రమాదంలో హోటల్ దగ్ధం



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద గల వేంకటేశ్వరస్వామి దేవస్థానం రోడ్‌లో ఉన్న పున్నయ్య హోటల్ శనివారం అగ్నిప్రమాదానికి గురైంది. నిబంధనలు పాటించకుండా భవనానికి ఎదురుగా తాటాకులతో నిర్మాణం చేపట్టడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని అగ్నిమాపక అధికారులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే తమ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోవడంతో మంటలు ఆర్పగలిగారని లేకుంటే పెను ప్రమాదం సంభవించేదని వారు పేర్కొన్నారు.

నిరాశ్రయుల ఆశ్రమానికి ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న రామకృష్ణ

గుడివాడ టౌన్: స్థానిక మందపాడులోని నిరాశ్రయుల ఆశ్రమానికి వైఎస్సార్ సీపీ నాయకుడు మాచర్ల రామకృష్ణ(ఆర్కే) రెండు సీలింగ్ ఫ్యాన్లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఫ్యాన్లు లేకపోవడం కారణంగా వర్షాకాలం దోమల కారణంగా ఆశ్రయం పొందేవారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ఫ్యాన్లు అందజేశామన్నారు. కుటుంబ సభ్యులు వై.శేఖర్, వై.రామోజి జ్ఞాపకార్థం వీటిని అందజేసినట్లు పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



చెక్కును అందజేస్తున్న వెంకయ్యనాయుడు దంపతులు

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ భూనీలా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదానానికి రూ.10,116 లు భక్తులు వితరణగా ఇచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. దేవాలయ కార్యాలయంలో నందివాడ గ్రామానికి చెందిన కొమ్మూరి వెంకయ్య నాయుడు–నాగమణి దంపతులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శనివారం ఈ మొత్తాలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వేదాంతం అప్పలాచార్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



సమావేశంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ముదినేపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా సమన్వయకర్త అడుసుమిల్లి నిర్మల సంస్థ కెరీర్ గైడెన్స్ చైర్మన్ డాక్టర్ సుధాబత్తుల విజయ కుమార్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో స్థానిక స్వామ్ ఐటీఐ కళాశాల్లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ప్రముఖమైనదని పేర్కొన్నారు. విద్యార్థులు సరైన ప్రణాళికలు రూపొందించుకుని వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. సంస్థ ఏలూరు శాఖ కార్యదర్శి వల్లూరిపల్లి సాయిసుధా, స్థానిక వైద్యుడు మనోజ్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రవి, సాక్షి సాయిబాబు, దాసు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



ముదినేపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ముదినేపల్లి రూరల్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముదినేపల్లిలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, ఎస్సై డి.వెంకటకుమార్ ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని, సంబంధించిన పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలకు జరిమానా విధించారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

ఘంటసాల: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ప్రతిఒక్కరూ ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలో ఏపీ కౌలు రైతుల సంఘం కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఘంటసాల బ్యాంకు సెంటర్ నుంచి ప్రధాన సెంటర్ మీదుగా విరాళాలు సేకరణ చేపట్టారు. ప్రజాప్రతినిధులు, వివిధ షాపుల నిర్వాహకులు తమవంతు సహకారం అందించారు. వివిధ సంఘాల నేతలు మిక్కిలినేని మధు, వేమూరి ప్రవీణ్, పంచకర్ల రంగారావు, యద్దనపూడి మధు, మేడంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుడివాడరూరల్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన చంటిబాబు

గుడివాడరూరల్: గుడివాడరూరల్ ఎస్‌ఐగా ఎస్.చంటిబాబు శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ మూర్తి మచిలీపట్నం వీఆర్‌కు బదిలీ కాగా నందివాడ ఎస్ఐగా పని చేస్తున్న చంటిబాబు గుడివాడరూరల్ ఎస్ఐగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐకి పోలీసు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

గుడివాడరూరల్: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని గుడివాడరూరల్ ఎస్‌ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెం సమీపంలో ఉన్న గుడివాడ–ముదినేపల్లి జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతో మరణించిన వారు ఎక్కువ మంది ఉన్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీపీఆర్‌సీ అధికారి ధర్మరాజు

పమిడిముక్కల: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని డీపీఆర్‌సీ అధికారి ధర్మరాజు పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. అనంతరం పమిడిముక్కల సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో కల్పించాల్సిన సౌకర్యాలు, తడి, పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. తొలుత పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక వనరుల లభ్యతపై ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీ శిక్షణ ఇచ్చారు.

టిడ్కో గృహాల బకాయిలు ప్రభుత్వం చెల్లించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: టీడీపీ అధికారంలో ఉండగా 2018–19లో నిర్మించిన టిడ్కో గృహాల బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పట్లో ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ అంటూ 1,037 గృహాలను అసంపూర్తిగా నిర్మించారన్నారు. అందుకు రూ.286 కోట్లు బకాయి ఉందన్నారు. ఆ తదుపరి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ బకాయిల విషయంలో టీడీపీ ప్రభుత్వం హౌసింగ్ శాఖ ద్వారా ఈ గృహాలు నిర్మించింది కనుక టిడ్కో గృహాల రుణాలకు దీని బకాయిలకు సంబంధం ఉండదన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున 1,037 గృహాలకు సంబంధించిన రుణాలను కూటమి ప్రభుత్వం చెల్లించాలని ఆయన కోరారు.

నిండు కుండలా పుల్లేరు కాలువ



బల్లిపర్రు లాకుల వద్ద జలకళతో పుల్లేరు కాలువ

పామర్రు: స్థానిక పుల్లేరు కాలువ నీటితో నిండి జలకళ సంతరించుకుంది. కృష్ణా నది నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో పుల్లేరు కాలువ ఫుల్‌గా ప్రవహిస్తోంది. పై నుంచి రోజుకు ఐదు వేల క్యూసెక్కులకు పైగా నీరు విడుదల చేయటంతో కాలువ నీటితో నిండి పోయింది. లాకుల వద్ద అన్ని గేట్లు ఎత్తి వేయడంతో పుల్లేరు కాలువ నీటితో నిండి పోవడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువ గట్లపైకి నీరు పొంగి పొర్లుతోంది. ఈ నీటితో ప్రస్తుతం రైతులు వరి నాట్లు వేసిన పొలాలకు నీటిని పెట్టుకుంటున్నారు.

సాహిత్య రంగంలో ఆణిముత్యం 'ముదిగొండ'



సభలో మాట్లాడుతున్న రావి రంగారావు

మచిలీపట్నంటౌన్: ముదిగొండ సీతారావమ్మ మరణం సాహిత్య రంగానికి తీరనిలోటని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు రావి రంగారావు అన్నారు. స్థానిక వివేకానంద మందిరంలో ముదిగొండ సీతారావమ్మ సంతాప సభను శనివారం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ ముదిగొండ సీతారావమ్మ 10 ఏళ్లు సాహితీమిత్రులు సంస్థకు కోశాధికారిగా సేవలు అందించారని, ఆమె తన రచనల్లో సమాజానికి ఉపయోగపడే విషయాలపై రాసిన కవితలు ప్రజలను చైతన్యవంతం చేశాయన్నారు. శతావధానం, అష్టావధానంలో ముదిగొండ తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరుచుకున్నారని కొనియాడారు. గుడివాడ సాహితీమిత్రులు సంస్థ అధ్యక్షుడు వసుధ బసవేశ్వర మాట్లాడుతూ జిల్లా సాహిత్యరంగంలో ముదిగొండ తనకంటూ ఓ పేజీని ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కారుమూరి రాజేంద్ర ప్రసాద్, భవిష్య, బాలాజీ, ముదిగొండ శాస్త్రి, ముదిగొండ ఫణిదూర్జటి, జొన్నల వెంకటనాగరాజు తదితరులు పాల్గొన్నారు.